


RNI: TELTEL12215

https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు

జాతీయ తెలుగు దినపత్రిక

www.prabhathasuryudu.com

ప్రచురణ :తెలంగాణ , సంపాదకులు :చెరుకు ఉపేందర్ , శుక్రవారం - 20 - సెప్టెంబర్ - 2024 ,

సంపుటి 02, సంచిక : 17, పేజీలు -4 వెల రూ.5/-



## టార్గెట్ మార్చిన హైడ్రా.. కూల్చివేతలు ఎక్కడంటే..!

- కొద్ది రోజులుగా హైడ్రా స్పీడ్ తగ్గించింది
- ఇప్పుడు హైడ్రా ఇలాంటి ప్రాజెక్టులపై విచారణ చేయనుంది
- హైడ్రా విచారణ చేసే జాబితాలో సాధారణ ప్రాజెక్టులతో పాటు బడా నిర్మాణ సంస్థలకు చెందిన 'లేక్ వ్యూ' ప్రాజెక్టులు

హైదరాబాద్ :హైదరాబాద్ లోని చెరువులు, ప్రభుత్వ భూములు పరిరక్షణగా ఏర్పాటైన హైడ్రా.. దూసు కెళ్తోంది. ఇప్పటికే చెరువుల్లోని మిగతా..2లో

## దీపావళికి ఉచిత గ్యాస్ ఇస్తాం: సీఎం చంద్రబాబు

### సంక్షేమ పథకాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అమలు చేస్తా

- కూటమి ప్రభుత్వం ఏర్పడి 100 రోజులు
- మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్లో కూటమి ఎమ్మెల్యేలతో చంద్రబాబు సమావేశం
- సంక్షేమ పథకాలు ఒక్కొక్కటి అమలు చేస్తామని వెల్లడి
- మూడు పార్టీలు ఇదే సమన్వ యంతో ముందుకెళ్లాలని పిలుపు



అమరావతి : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులైన సందర్భంగా ఏపీ సీఎం చంద్రబాబు మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ లో ఎమ్మె ల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మిగతా..2లో

వరద బాధితులందరికీ సాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. తప్పిదాలకు పాల్పడిన వారిని చట్ట ప్రకారం శిక్షిస్తామని పేర్కొన్నారు. చట్టాన్ని పరిరక్షించడానికి వ్యవస్థలు ఉన్నాయని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు.

## 15 ఏళ్లు దాటిన వాహనాలకు రోడ్లపైకి నో పర్మిషన్



### జనవరి నుంచి అమలుకు రేవంత్ సర్కార్ ప్లాన్

- తెలంగాణలో 15 ఏళ్లు దాటిన వాహనాలు 30 లక్షలకు పైగా ఉన్నాయి
- ఇలాంటి వాహనాలను ప్రభుత్వ శాఖల్లో 10 వేలు ఉన్నాయి
- ఇతర రాష్ట్రాలు ప్రతిపాదించిన విధానాలను తెలంగాణలో కూడా అమలు చేయాలని ప్రభుత్వం

హైదరాబాద్ : కాలుష్యానికి కారణ మయ్యే వాహ నాలను స్క్రాప్ చేయా లని రేవంత్ రెడ్డి ప్రభు త్వం భావిస్తోంది. 2025 జనవరి 1 నుంచి 15 ఏళ్లు లేదా అం తకంటే ఎక్కువ కాలం ఉన్న వాహ నాలను, ఫిట్ నెస్ పరీక్షల్లో ఫెయి లైన వాహనాలను రోడ్లపైకి అనుమ తించరు. లేదా ఇలా ంటి వా హనాలను రిజిస్ట్రేషన్ కూడా చేయ వద్దని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. 2లో

## మా ఫోన్లు కూడా పేలుతాయేమో.. భయాందోళనలో లెబనీస్ ప్రజలు

- ఎలక్ట్రానిక్ వార్‌తో లెబనీస్ ప్రజలు భయాందోళనలు వ్యక్తం
- మంగళవారం పేజర్లు, బుధవారం వాకీటాకీలు పేలిన ఘటన
- రాజధాని బీరట్‌లో ఆకాశం పొగతో కమ్ముకున్నది



## తెలంగాణాకు భారీ వర్షం హెచ్చరిక పంపిన బంగాళాఖాతం!

హైదరాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావం వల్ల దేశవ్యాప్తంగా ఇంకా అనేక ప్రాంతాలలో వర్షాలు కొనసాగుతున్నాయి. ఇటు తెలంగాణ రాష్ట్రంలోనూ అడపాదడపా కొన్ని ప్రాంతాలలో వర్షాలు కురుస్తున్నాయి. గత 20 రోజుల క్రితం తెలంగాణ రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలు, వరదలు దెబ్బకు తెలంగాణలో 29 జిల్లాలను మిగతా..2లో



## కాంగ్రెస్ కూటమి వైఖరికే మా మద్దతు..! కశ్మీర్‌పై పాక్ రక్షణ మంత్రి కీలక వ్యాఖ్యలు..!

ఢిల్లీ: 370 ఎ పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. జమ్మూ కశ్మీర్‌లో ఆర్టికల్ 370పై కాంగ్రెస్ కూటమి వైఖరితో తమ దేశం ఏకీభవిస్తుందని వ్యాఖ్యానించారు. దాదాపు పదేళ్ల తర్వాత జమ్మూ కశ్మీర్‌లో బుధవారం ఎన్నికల జరిగిన విషయం తెలిసిందే. కాంగ్రెస్ మేనిఫెస్టోలో జమ్మూ కశ్మీర్ రాష్ట్ర స్టేటస్ పునరుద్ధరణపై ప్రస్తావించింది. అయితే, మిగతా..2లో



## నేను గమనించింది ఏంటంటే చంద్రబాబు దేనికీ భయపడరు



- కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు
- మూడు పార్టీల ఎమ్మెల్యేలతో సమావేశమైన సీఎం చంద్రబాబు
- చంద్రబాబు సారథ్యంలో పనిచేయడం ఆనందంగా ఉందన్న పవన్

అమరావతి : ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి 100 రోజుల మిగతా..2లో

# పవన్ కల్యాణ్ వ్యూహం మొదలు పెట్టారా? ఇక దబిడి దిబిడేనా?



అమరావతి: జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యూహాన్ని మార్చుకున్నట్లు కనపడుతుంది. భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని ఆయన ఏపీ పాలిటిక్స్ ను తన చేతిలోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నట్లు స్పష్టంగా కనపడుతుంది. ఇప్పటి వరకూ అధికారానికి దూరంగా ఉన్న పవన్ కల్యాణ్ ఇటీవలే డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గా బాధ్యతలను చేపట్టారు. అయితే అప్పటి నుంచి ఆయన మిత్రపక్షాలతో సయోధ్యతతో సాగుతున్నారు. తాను నొప్పించక.. ఎవరినీ ఒక్క మాట కూడా అనకుండా తన పని తాను చేసు కుపోతున్నారు. ఎన్నికలకు ముందు దూకుడుగా ఉన్న పవన్ కల్యాణ్ తర్వా త చాలా వరకూ నెమ్మదించారు. 2లో

గతంలో చేరికలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వని పవన్ ఇప్పుడు మాత్రం వాటిపై దృష్టి పెట్టడం చర్చనీయాంశమైంది. ముఖ్యమైన ప్రాంతాల్లో, నియోజకవర్గాల్లో నేతలను పార్టీలోకి తీసుకుంటూ భవిష్యత్‌లో మరింతగా పార్టీని విస్తరించాలన్న వ్యూహంతో ఆయన వెళుతున్నట్లు కనపడుతుంది. అందులో భాగంగానే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, సామినేని ఉదయభానుల చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెబుతున్నారు.

- అధికారానికి దూరంగా ఉన్న పవన్ కల్యాణ్ ఇటీవలే డిప్యూటీ చీఫ్ మినిస్టర్ గా బాధ్యతలను చేపట్టారు
- ప్రశాంతంగా పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టినట్టు జరుగుతున్న రాజకీయ పరిణామాలను బట్టి స్పష్టమవుతుంది
- టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతిచ్చినప్పటికీ ఆయన బలం ఏంటో ప్రత్యర్థులకు తెలిసి రాలేదు
- ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేనను గెలిపించుకున్నారు



## రైతుల సంఘటిత శక్తి ముందు దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పదు

- రైతులు చలో ప్రజాభవన్ కు పిలుపునిచ్చిన పాపానికి వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం
- వారేమైనా దొంగలా, ఉగ్రవాదులా అని ప్రశ్నించారు
- ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీఇచ్చి మోసం చేసినందుకే రైతులు ఆందోళన పథం పట్టారు

## తిరుమల లడ్డూ ప్రసాదంపై టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు: వైఎస్ షర్మిల



- తిరుమల శ్రీవారి ప్రసాదం లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం
- లడ్డూ తయారీకి జంతువుల నూనెలు వాడారన్న సీఎం చంద్రబాబు
- చంద్రబాబు వ్యాఖ్యలను ఖండించిన ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల
- సీఎం వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయన్న షర్మిల
- తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేసి విచారణ జరిపించాలని షర్మిల డిమాండ్

అమరావతి: తిరుమల శ్రీవెంకటేశ్వరుడి ప్రసాదం లడ్డూపై తీవ్ర రాజకీయ దుమారం నడుస్తోంది.



## మొదటిసారి వచ్చాను కాబట్టి సున్నితంగా చెబుతున్నాను: బండి సంజయ్ హెచ్చరిక

- రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించిన సంజయ్
- భోజనం, టాయిలెట్లపై ఫిర్యాదు చేసిన విద్యార్థులు
- మన పిల్లలకు ఇలాంటి భోజనమే పెడతామా? అని బండి సంజయ్ నిలదీత

హైదరాబాద్ : టాయిలెట్‌లో నీళ్లు లేకపోతే పట్టించుకోరా? మొదటిసారి వచ్చాను కాబట్టి మిగతా..2లో




# జమిలికి బీఆర్ఎస్ స్వాగతమేనా?

- కేంద్ర మంత్రి వర్గం ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది
- బీజేపీతో పాటు అనేక ఇతర పార్టీలు ఎన్డీయేలో ఉన్నాయి
- తెలుగు రాష్ట్రాలలో అలా చూసుకుంటే ఏపీలో వైసీపీ
- తెలంగాణలో బీఆర్ఎస్ ఉన్నాయి
- జమిలి ఎన్నికల మీద తన స్టాండ్ ఏంటో ఇంకా చెప్పలేదు
- తమ పార్టీలో చర్చించిన మీదటనే జమిలి ఎన్నికల మీద నిర్ణయం

హైదరాబాద్ : కేంద్రం జమిలి ఎన్నికలకు సంబంధించి మాజీ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ కమిటీ ఇచ్చిన సిఫారసులను ఆమోదించింది. కేంద్ర మంత్రి వర్గం మిగతా..2లో



## టార్గెట్ మార్చిన హైడ్రా.. కూల్చివేతలు ఎక్కడంటే..!

మొదటి పేజి తరువాయి

బఫర్, ఎఫ్టీఎల్ లో ఉన్న నిర్మాణాలను కూల్చి వేసిన సంగతి తెలిసిందే. కొద్ది రోజులుగా హైడ్రా స్పీడ్ తగ్గించింది. తాజాగా లేక్ వ్యూ పేరుతో ప్రజలను ఆకర్షితులను చేస్తున్నారు. చాలా మంది బిల్డర్లు, చెరువులను అక్రమించి లేదా చెరువుల బఫర్ జోన్, ఎఫ్టీల్ లో అపార్ట్ మెంట్లు నిర్మించి లేక్ వ్యూ అని ప్రచారం చేసుకుంటున్నాయి. ఇప్పుడు హైడ్రా ఇలాంటి ప్రాజెక్టులపై విచారణ చేయనుంది. ఈ ప్రాజెక్టులు బఫర్ లోజన్, ఎఫ్టీఎల్ లో ఉన్నాయా లేదా చెక్ చేయనుంది. హైడ్రా విచారణ చేసే జాబితాలో సాధారణ ప్రాజెక్టులతో పాటు బడా నిర్మాణ సంస్థలకు చెందిన 'లేక్ వ్యూ' ప్రాజెక్టులు ఉన్నట్లు తెలుస్తోంది. హైడ్రా చర్యలతో చెరువులకు దగ్గర ఉన్న నిర్మాణాల్లో కొనుగోలు చేసేందుకు కస్టమర్లు భయపడుతున్నారు. హైడ్రా త్వరగా విచారణ పూర్తి చేస్తే ఏ ప్రాజెక్టు బఫర్ జోన్, ఎఫ్టీఎల్ లో ఉందో తెలుసుకోవచ్చు. దీంతో పాటు హైడ్రా హుస్సేన్ సాగర్ పై ఫోకస్ పెట్టనట్లు తెలుస్తోంది. థ్రిల్ సిటీ, జలవహార్ హుస్సేన్ సాగర్ ఎఫ్టీఎల్ లో నిర్మించారని హైడ్రాకు భారీగా ఫిర్యాదులు వెళ్లాయి. హుస్సేన్ సాగర్ పక్కకు నిర్మించిన జలవిహార్ పై చర్యలు తీసుకోవాలని తాజాగా సీపీఐ నేతలు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. సీపీఐ జాతీయ నేత, మాజీ ఎంపీ అజీజ్ పాషా ఫిర్యాదు చేసిన వారిలో ఉన్నారు. స్సేన్ సాగర్ బఫర్ జోన్, ఎఫ్టీఎల్ 12.5 ఎకరాల్లో జలవిహార్ ఉందని వారు పేర్కొన్నారు. హుస్సేన్ సాగర్ ఎఫ్టీఎల్, బఫర్ జోన్ పరిధి జలవిహార్ నిర్మాణాన్ని వ్యతిరికిస్తూ ఫోరమ్ ఫర్ బెటర్ హైదరాబాద్ కోర్టును ఆశ్రయించినట్లు గుర్తు చేశారు. అలాగే థ్రిల్ సిటీ పై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్లు వస్తున్నాయి. దీంతో హైడ్రా హుస్సేన్ సాగర్ పై దృష్టి పెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. 2007లో అప్పటి ప్రభుత్వం జలవిహార్ ఏర్పాటు చేసుకునేందుకు 30 ఏళ్ల పాటు భూమిని లీజ్ కు ఇచ్చింది.

## మా ఫోన్లు కూడా పేలుతాయేమో..
## భయాందోళనలో లెబనీస్ ప్రజలు

బీరట్: ఎలక్ట్రానిక్ వస్తువులతో లెబనీస్‌పై జరుగుతున్న దాడి .. ఆ దేశ ప్రజల్ని తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్నది. రెండు రోజుల్లో జరిగిన ఎలక్ట్రానిక్ వస్తువుల పేలుళ్లు.. పెను అనుమానాలకు దారి తీస్తున్నది. మంగళవారం పేజర్లు, బుధవారం వాకీటాకీలు పేలిన ఘటనలో.. 32 మంది మరణించగా, వేలాది మంది గాయపడ్డారు. అయితే నిగూఢంగా సాగుతున్న ఎలక్ట్రానిక్ వార్‌తో లెబనీస్ ప్రజలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. తమ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు ఎంత వరకు సురక్షితమో తెలియకుండాపోతుందని అంటున్నారు. ఏ క్షణమైనా ఫోన్లు పేలుతాయేమో అన్న టెన్షన్‌లో అక్కడి ప్రజలు ఉన్నారు. ఎలక్ట్రానిక్ డివైస్‌లు పేలుతున్న తీరు అంతుచిక్కని అటాక్‌గా మిగిలిపోయింది. బుధవారం వాకీటాకీలు పేలిన సమయంలో.. రాజధాని బీరట్‌లో ఆకాశం పొగతో కమ్ముకున్నది. ఒక్క బీరట్‌లోనే వందల సంఖ్యలో వాకీటాకీలు పేలినట్లు ఆరోపణలు వస్తున్నాయి. బీరట్‌లోని రాఫిక్ హరిరి విమానాశ్రయంలో వాకీటాకీలను, పేజర్లను బ్యాన్ చేశారు. ప్రయాణికులు ఎవరూ వాటిని పట్టుకెళ్లరాదు అని ఆదేశాలు జారీ చేశారు. ఒకవేళ అవి కనిపిస్తే, వాటిని స్వాధీనం చేసుకోనున్నట్లు ప్రకటన చేశారు. ఎలక్ట్రానిక్ అటాక్ జరుగుతున్న తీరుతో బీరట్ వీధులన్నీ రక్తంమయంగా మారుతున్నాయి. చేతులు, నడుములు, కంటి గాయాలతో యువకులు రోడ్ల మీద కనిపిస్తున్నట్లు ప్రత్యక్షసాక్ష్యులు చెబుతున్నారు. ఒకరి పక్కన ఒకరు నడిచేందుకు జంకుతున్నారని ఒకరు ఆరోపించారు. పరిస్థితి చాలా భయానకంగా ఉందని స్థానికులు అంటున్నారు. గందరగోళం మధ్య చాలా మంది తమ ప్రయాణాలను ఆపేశారు. గాజా వార్ వల్ల ఇప్పటికే లెబనాన్‌పై తీవ్ర ప్రభావం పడింది. తాజా దాడులతో ఆ దేశ ఆర్థిక వ్యవస్థ మరింత క్షీణించే అవకాశాలు ఉన్నాయి. ఎలక్ట్రానిక్ వస్తువులతో పేలుళ్లకు పాల్పడడం క్రిమినల్ చర్య అవుతుందని ప్రముఖ అంతర్జాతీయ యుద్ధ న్యాయవాదులు చెబుతున్నారు. పేజర్లు,వాకీటాకీలతో పేలుళ్లకు పాల్పడం నేరమే అని వార్‌క్రైం లాయర్ సర్ జెఫ్రీ నైస్ తెలిపారు. ఎలక్ట్రానిక్ వస్తువులతో దాడి చేయడం అక్రమమే అవుతుందన్నారు. ఇది పౌరులను టార్గెట్ చేయడమే అవుతుందన్నారు. ఇజ్రాయిల్‌లోని జనజీవన ప్రదేశాల్లోకి హమాస్ మిస్సైళ్లు వదిలిన ఘటనతో పోల్చవచ్చు అని తెలిపారు. మరోవైపు ఇజ్రాయిల్, లెబనాన్ మధ్య బోర్డర్ దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. ఏడు హిజ్‌బుల్లా క్షేత్రాలను టార్గెట్ చేసినట్లు ఇజ్రాయిల్ మిలిటరీ తెలిపింది. పేజర్లు, వాకీటాకీల అటాక్‌తో తమకు సంబంధం లేదని ఇజ్రాయిల్ స్పై ఏజెన్సీ మోసాద్ తెలిపింది.

## తెలంగాణాకు భారీ వర్ష
## హెచ్చరిక పంపిన బంగాళాఖాతం!

మొదటి పేజి తరువాయి

వరద ప్రభావిత జిల్లాలుగా ప్రభుత్వం గుర్తించి వరద సహాయక చర్యలను చేపట్టింది.

తెలంగాణా రాష్ట్రంలో వర్షాలు

తెలంగాణలో వరదలకు తీవ్రంగా నష్టపోయిన ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్ వంటి జిల్లాలలో ప్రజలు ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు.ఇదిలా ఉంటే తెలంగాణ రాష్ట్రానికి మరోసారి వర్షాలు పడే సూచన ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో రేపటి నుంచి వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొంది. సెప్టెంబర్ 20నుంచి 22వరకు రెండు రోజులపాటు తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాలలో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.

ఈ జిల్లాలలో భారీ వర్షాలు .. అలెర్ట్

ఆదిలాబాద్, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల, నిజామాబాద్, జనగామ, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, ఆసిఫాబాద్ జిల్లాలలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు మెరుపులతో కూడిన వర్షాలతో పాటు పిడుగులు కూడా పడే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.వర్షాలు పడే జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో ఎలెర్ట్ జారీ చేసింది.

### తెలంగాణాకు మళ్ళీ వాన గండం

వర్షాలు పడే జిల్లాలలో బలమైన ఈదురు గాలులు గంటకు 30 నుండి కిలోమీటర్ల వేగంతో అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. అయితే మళ్ళీ ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో ఈనెల 24 న అల్పపీడనం ఏర్పడి అది తుఫానుగా మారే అవకాశం ఉన్న నేపథ్యంలో తెలంగాణాలో మళ్ళీ వర్షాలు పడే అవకాశం లేకపోలేదని చర్చ జరుగుతుంది.

ప్రస్తుతం వర్షాలకు కారణం ఇదే

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావం తెలంగాణ రాష్ట్రంలో పెద్దగా లేకపోయినప్పటికీ ఏపీ, యానం ప్రాంతంలో దిగువ ట్రోపో ఆవరణంలో చేసుకున్న మార్పులు, నైరుతి, వాయువ్య దిశగా గాలులు వీస్తున్నాయని, వీటి ప్రభావంతో కూడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు అంటున్నారు.

రెండురోజులుగా తెలంగాణలో చాలా ప్రాంతాల్లో భిన్న వాతావరణం

ఏది ఏమైనా మళ్లీ తెలుగు రాష్ట్రాలలో వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని సూచిస్తున్నారు. ఇదిలా ఉంటే గత రెండు రోజులుగా తెలంగాణ రాష్ట్రంలో వాతావరణంలో మార్పు కనిపిస్తుంది .అనేక ప్రాంతాలలో ఉష్ణోగ్రతలు పెరిగి మళ్ళీ ఎండలు ప్రజలకు చెమటలు పట్టిస్తున్నాయి.

## కాంగ్రెస్ కూటమి వైఖరికే మా మద్దతు..!
## కశ్మీర్‌పై పాక్ రక్షణ మంత్రి కీలక వ్యాఖ్యలు..!

మొదటి పేజి తరువాయి

ఆర్టికల్ 370పై మాత్రం మౌనం వహించింది. అయితే, పాక్‌లో జరిగిన ఓ టీవీ కార్యక్రమంలో రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా యాంకర్ జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలపై అడిగిన ఓ ప్రశ్నకు స్పందించారు. కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ జమ్మూ కశ్మీర్ ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తున్నాయన్నాయని.. ఆ పార్టీలకే విజయ అవకాశాలున్నాయన్నారు. కశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35ఏ అమలు చేసిన సమయంలో కేంద్రంలో కాంగ్రెస్‌కు చెందిన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ, కశ్మీర్‌లో షేక్ అబ్దుల్లా అధికారంలో ఉన్నారని చెప్పారు. తాజాగా ఇద్దరు కలిసి కశ్మీర్‌లో ఆర్టికల్ 370, 35ఏ అమలు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇది జరిగితే చాలా బాగుంటుందని.. ఆర్టికల్ 370, 35ఏపై కాంగ్రెస్, దాని మిత్రపక్షాల స్టాండ్‌తోనే తాము ఉన్నామన్నారు. పాక్ మంత్రి వ్యాఖ్యల నేపథ్యంలో దేశ రాజకీయాలు మరోసారి వేడెక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాహుల్ గాంధీ ఇప్పటికే అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ విమర్శలు గుప్పిస్తున్నారు. బీజేపీ నేత అమిత్ మాల్వియా సోషల్ మీడియాలో స్పందిస్తూ పాక్ ఉగ్రవాదానికి ఆశ్రయమిస్తున్న దేశమని.. ఆ దేశం కశ్మీర్ విషయంలో కాంగ్రెస్, నేషనల్ కాన్ఫరెన్స్ వైఖరికి మద్దతు ఇస్తుందని విమర్శించారు.

## మొదటిసారి వచ్చాను కాబట్టి సున్నితంగా
## చెబుతున్నాను: బండి సంజయ్ హెచ్చరిక

మొదటి పేజి తరువాయి

సున్నితంగా చెబుతున్నాను... మరోసారి కూడా ఇలాగే చేస్తే మామూలుగా చెప్పబోనని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ హెచ్చరించారు. ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలంలోని ఏకలవ్య మోడల్ స్కూల్‌ను సందర్శించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులను వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అన్నంలో రాళ్లు వస్తున్నాయని, టాయిలెట్లు సరిగ్గా లేవని, నీళ్లు కూడా రావడం లేదని విద్యార్థులు ఫిర్యాదు చేశారు. అధికారులు, ఉపాధ్యాయులతో బండి సంజయ్ సమావేశం నిర్వహించారు. అన్నంలో రాళ్లు వస్తున్నాయని విద్యార్థులు చెబుతున్నారని, మన పిల్లలకు ఇలాంటి ఆహారం పెడతామా? అని నిలదీశారు. టాయిలెట్‌లు సరిగ్గా లేకుంటే పట్టించుకోకపోతే ఎలా? అని మండిపడ్డారు. తాను రెండోసారి వచ్చినప్పుడు కూడా ఇలాగే ఉంటే సున్నితంగా చెప్పేది ఉండదని స్పష్టం చేశారు.

### టాయిలెట్ల నిర్మాణానికి శంకుస్థాపన

ప్రధాని మోదీ ఆదేశాల మేరకు ప్రతి ఎంపీ తన పరిధిలోని ఏకలవ్య పాఠశాలను సందర్శించి సమస్యలు తెలుకుంటున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా తానూ ఇక్కడకు వచ్చానన్నారు. దేశవ్యాప్తంగా 728 ఏకలవ్య పాఠశాలలు ఉన్నాయని, ఇప్పటి వరకు 410 పాఠశాలల్లో విద్యాబోధన కొనసాగుతోందన్నారు. దేశవ్యాప్తంగా ఏకలవ్య పాఠశాలల్లో 1.20 లక్షల మంది చదువుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణలోని 23 ఏకలవ్య పాఠశాలల్లో 8,300 మంది విద్యార్థులు చదువుకుంటున్నారని తెలిపారు.

## దీపావళికి ఉచిత గ్యాస్ ఇస్తాం: సీఎం చంద్రబాబు




మొదటి పేజి తరువాయి

మాట్లాడుతూ, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఉచిత గ్యాస్ ను దీపావళికి అందిస్తామని చెప్పారు. సంక్షేమ పథకాలన్నీ ఒకదాని తర్వాత ఒకటి అమలు చేస్తామని వెల్లడించారు. గురువారం మంత్రివర్గ సమావేశంలో చాలా సమస్యల పరిష్కారానికి శ్రీకారం చుట్టామని తెలిపారు. వరద బాధితు లందరికీ సాయం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు. తప్పులు చేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. తప్పిదాలకు పాల్పడిన వారిని చట్ట ప్ర కారం శిక్షిస్తామని పేర్కొన్నారు. చట్టాన్ని పరిరక్షించడానికి వ్యవస్థలు ఉన్నాయని, చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు. కూటమి పార్టీల గురించి చెబుతూ, ప్రస్తుతం ఉన్న సమన్వయమే భవిష్యత్తులోనూ మూడు పార్టీల మధ్య ఉంటుందని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. అభిప్రాయభేదాలు లేకుండా ముందుకు సాగాలని టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలకు పిలుపునిచ్చారు. సుదీర్ఘకాలం ఒకే ప్రభుత్వం ఉంటేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు నిత్యం విష ప్రచారం చేస్తూనే ఉన్నారని, మనం ఏం చేస్తున్నామో ప్రజలకు తెలియాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎల్లుండి నుంచి ఆరు రోజుల పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి పనుల గురించి ప్రజలకు తెలియజెప్పాలని కూటమి ఎమ్మెల్యేలకు సీఎం చంద్రబాబు సూచించారు. ఇక, తిరుమల వ్యవహారాలపైనా చంద్రబాబు స్పందించారు. గతంలో తిరుమల లడ్డూ నాణ్యతపై తీవ్ర విమర్శలు వచ్చాయని గుర్తుచేశారు. గతంలో వెంకటేశ్వరస్వామి పవిత్రతను దెబ్బతీశారని, తిరుమల అన్నదానంలో నాణ్యత పాటించలేదని ఆరోపించారు. దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేసేలా నాసిరకం పదార్థాలు వాడారని మండిపడ్డారు. దేవుడి ప్రసాదంలో నెయ్యికి బదులు, జంతువుల కొవ్వు వాడారని చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. శ్రీవారి ప్రసాదానికి స్వచ్ఛమైన నెయ్యి వాడాలని చెప్పామని, ప్రస్తుతం దేవుడి ప్రసాదం నాణ్యత పెరిగిందని వెల్లడించారు. వెంకటేశ్వరస్వామి పవిత్రతను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు.

## పవన్ కల్యాణ్ వ్యూహం మొదలు పెట్టారా? ఇక దబిడి దిబిడేనా?

మొదటి పేజి తరువాయి




ప్రశా ంతంగా పార్టీ బలోపేతంపై ఫోకస్ పెట్టి నట్లు జరుగుతున్న రాజ కీయ పరిణామాలను బట్టి స్పష్టమవుతుంది.

పదేళ్ల నుంచి...

2014లో జనసేన ఏర్పడిన నాటి నుంచి పవన్ కల్యాణ్ పార్టీ బలోపేతంపై పెద్దగా దృష్టి సారించలేదు. అందులో 2014 ఎన్నికల్లో తాను పోటీచేయకపోయినా టీడీపీ, బీజేపీ కూటమికి మద్దతిచ్చినప్పటికీ ఆయన బలం ఏంటో ప్రత్యర్థులకు తెలిసి రాలేదు. బలం, బలంగం తనకు పుష్కలంగా ఉందని నిరూపించుకుందామని 2019 ఎన్నికల్లో పవన్ కల్యాణ్ చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. పైగా 2019 ఎన్నికల్లో పవన్ పోటీ చేసిన రెండు స్థానాలతో పాటు ఒక్కటి మినహా అన్ని స్థానాల్లో జనసేన ఓడి పోవడంతో అనేక మంది పార్టీని వీడిపోయారు. అందుకే పవన్ కల్యాణ్ ఎవరినీ నమ్మలేదు. దగ్గరకు కూడా రానివ్వలేదంటారు.

కూటమి ఏర్పాటులో...

కానీ 2024 ఎన్నికల్లో తాను వ్యూహంతో వెళుతున్నానని చెప్పి మరీ పవన్ కల్యాణ్ టీడీపీ, బీజేపీతో కలిపి కూటమిని కట్టే ప్రయత్నం చేశారు. సక్సెస్ అయ్యారు. పవన్ కల్యాణ్ వల్లనే కూటమి ఏర్పాటు సాధ్యమయిందని టీడీపీ అధినేత చంద్రబాబు సయితం అంగీకరించారు. అందుకే మొన్నటి ఎన్నికల్లో హండ్రెడ్ పర్సెంట్ స్ట్రయిక్ రేట్ తో పోటీ చేసిన అన్ని స్థానాల్లో జనసేనను గెలిపించుకున్నారు. శపథం చేసినట్లుగానే జగన్ ను అధికారం నుంచి దించగలిగారు. మరోవైపు కొత్తగా ఏర్పడిన ప్రభుత్వంలో కీలకమైన శాఖలను ఎంచుకుని మరీ తాను తీసుకున్నారు. మంత్రి పదవుల కోసం పెద్దగా పట్టుబట్టకుండా పట్టువిడుపులు ప్రదర్శించారు. దీంతో పవన్ స్ట్రాటజీ ఏంటో జనసైనికులకు అర్థం కాకుండా పోయింది.

చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి...

అయితే ఇప్పుడు జనసేనాని పవన్ కల్యాణ్ వైసీపీని టార్గెట్ చేసినట్లు కనిపిస్తుంది. గతంలో చేరికలకు పెద్దగా ప్రాధాన్యం ఇవ్వని పవన్ ఇప్పుడు మాత్రం వాటిపై దృష్టి పెట్టడం చర్చనీయాంశమైంది. ముఖ్యమైన ప్రాంతాల్లో, నియోజకవర్గాల్లో నేతలను పార్టీలోకి తీసుకుంటూ భవిష్యత్‌లో మరింతగా పార్టీని విస్తరించాలన్న వ్యూహంతో ఆయన వెళుతున్నట్లు కనపడుతుంది. అందులో భాగంగానే మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసులురెడ్డి, సామినేని ఉదయభానుల చేరికలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని చెబుతున్నారు. తమ కుటుంబం కొన్నాళ్ల పాటు ఉన్న ఒంగోలులోనూ, పట్టులేని కృష్ణా జిల్లాలో పట్టు పెంచుకునే ప్రయత్నంలో భాగంగా ఇద్దరు నేతల చేరికకు పవన్ కల్యాణ్ ఓకే చెప్పారని తెలిసింది. ప్రస్తుతానికి ఎన్డీఏ కూటమిలో ఎలాంటి పొరపొచ్చాలు లేకపోయినా, భవిష్యత్ లో రావన్న గ్యారంటీ లేదు. అందుకే ముందు చూపుతో ఆర్థికంగా, సామాజికంగా బలమైన నేతలను పార్టీలోకి తీసుకుంటున్నారన్న టాక్ గాజుగ్లాసు పార్టీలో ఓపెన్ టాక్ అయింది.

## నేను గమనించింది ఏంటంటే
## చంద్రబాబు దేనికీ భయపడరు

మొదటి పేజి తరువాయి

అయిన సందర్భంగా మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్ లో సీఎం చంద్రబాబు కూటమి ఎమ్మెల్యేలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ ప్రసంగిస్తూ... చంద్రబాబు సారథ్యంలో పనిచేయడం ఆనందం కలిగించే విషయం అని అన్నారు. చంద్రబాబులో తాను గమనించిన అంశం ఏమిటంటే, ఆయన దేనికీ భయపడే వ్యక్తి కాదని అన్నారు. విపక్షంలో ఉన్న సమయంలోనూ ఆయన కళ్లలో భయం కనిపించలేదని స్పష్టం చేశారు. అక్రమ కేసులో అరెస్టయి జైల్లో ఉన్న సమయంలో చంద్రబాబు గుండె ధైర్యాన్ని చూశానని తెలిపారు. జీవితంలో అనేక కష్టనష్టాలు ఎదుర్కొన్న వ్యక్తి చంద్రబాబు అని వివరించారు. ఆయన జైల్లో ఉన్నప్పుడు తాను షూటింగ్ లు కూడా మానేశానని, నిర్మాతలు అడిగినా రానని చెప్పానని పవన్ గుర్తుచేసుకున్నారు. చంద్రబాబు ఎంతగా కష్టపడి పనిచేస్తారో ఇటీవల వరదల సమయంలో చూశానని వెల్లడించారు. పాతికేళ్ల యువకుడిలా ఆయన శ్రమించిన తీరు అందరికీ స్ఫూర్తిదాయకమని అన్నారు. ఆయన స్వయంగా చేయడం ఎందుకు, అజమాయిషీ చేయవచ్చు కదా అని కొందరు అనుకోవచ్చు... కానీ క్షేత్రస్థాయిలో ఆయన పని చేయడం వల్ల ముఖ్యంగా అధికారులకు మార్గదర్శనం చేసినట్టయిందని, విపత్తు సమయాల్లో ఎలా పనిచేయాలో ఆయన ఒక దారి చూపించారని వివరించారు. ఒకరకమైన అలసత్వానికి లోనైన అధికారుల్లో చలనం తీసుకువచ్చారని చంద్రబాబుపై పవన్ కల్యాణ్ ప్రశంసల జల్లు కురిపించారు. చంద్రబాబు ఓపిక చూస్తే ఆశ్చర్యం కలుగుతుందని, అయితే వైసీపీ మాత్రం విమర్శలు చేస్తోందని వ్యాఖ్యానించారు. మంచి పనులు చేసే చంద్రబాబు వంటి వ్యక్తి అందరూ అండగా ఉండాలని పవన్ పిలుపునిచ్చారు.

## రైతుల సంఘటిత శక్తి ముందు దగాకోరు
## కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పదు

హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా రైతులను అక్రమంగా అరెస్టు చేయడంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రుణమాఫీ మాట నిలబెట్టుకోవాలని రైతులు చలో ప్రజాభవన్ కు పిలుపునిచ్చిన పాపానికి వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బుధవారం రాత్రి నుంచి రైతులను, రైతు సంఘాల నాయకులను అక్రమంగా అరెస్టుచేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించడం దారుణమైన చర్య అన్నారు. వారేమైనా దొంగలా, ఉగ్రవాదులా అని ప్రశ్నించారు. గురువారం ఉదయం నుంచి కూడా అనేక చోట్ల అన్నదాతల ఇళ్లకు వెళ్లి వారిని అదుపులోకి తీసుకుంటున్నట్టు సమాచారం అందుతున్నదని చెప్పారు. ఇలాంటి అప్రజాస్వామిక చర్యలను ప్రభుత్వం ఇకనైనా ఆపాలన్నారు. పోలీసుల నిర్బంధకాండతో రైతుల కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని వెల్లడించారు. అక్రమంగా నిర్బంధించిన రైతులందరినీ వెంటనే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రైతులంటే ఇంత భయమెందుకు.. అన్నదాతలపై ఇంతటి నిర్బంధమెందుకని ప్రశ్నించారు. అధికారంలోకి వస్తే ఏకకాలంలో రూ.2 లక్షలు రుణమాఫీ చేస్తామని హామీఇచ్చి మోసం చేసినందుకే రైతులు ఆందోళన పథం పట్టారని తెలిపారు. ఏ రాజకీయపార్టీతో సంబంధం లేకుండా తమకు తామే సంఘటితమై మొదలుపెట్టిన ఈ రైతు ఉద్యమం ఇంతటితో ఆగదన్నారు. రైతుల సంఘటిత శక్తి ముందు దగాకోరు కాంగ్రెస్ ప్రభుత్వం తలవంచక తప్పదని హెచ్చరించారు. రుణమాఫీ మాట నిలబెట్టుకోవాలని రైతులు చలో ప్రజాభవన్ కు పిలుపునిచ్చిన పాపానికి రాష్ట్రవ్యాప్తంగా వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం..

## తిరుమల లడ్డూ ప్రసాదంపై
## టీడీపీ, వైసీపీ నీచ రాజకీయాలు: వైఎస్ షర్మిల

మొదటి పేజి తరువాయి

ఈ పవిత్రమైన లడ్డూ ప్రసాదం తయారీకి జంతువుల నూనెలు వాడారని స్వయంగా సీఎం చంద్రబాబు నాయుడు ఆరోపణలు చేయడం కలకలం రేపింది. పవిత్రమైన తిరుమల ఆలయంపై అలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల ఇప్పుడు నెట్టింట చర్చకు దారితీసింది. కాగా చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను ఏపీ పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఖండించారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని ఆమె హితవు పలికారు. ఈ మేరకు తిరుమల లడ్డూపై చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై వైఎస్ షర్మిల 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా స్పందించారు. తిరుమలను అపవిత్రం చేస్తూ, హిందువుల మనోభావాలను దెబ్బతీసేలా టీడీపీ, వైసీపీలు నీచ రాజకీయాలు చేస్తున్నాయని ఆమె మండిపడ్డారు. సీఎం హెూదాలో లడ్డూ ప్రసాదంలో నెయ్యికి బదులు జంతువుల నూనెలు వాడారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తిరుమల పవిత్రత, ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఉన్నాయని షర్మిల ఆందోళన వ్యక్తం చేశారు. కోట్లాదిమంది హిందువుల ఆరాధ్య దైవం వేంకటేశ్వరుడికే మచ్చ తెచ్చేలా ఉన్నాయని తెలిపారు. చంద్రబాబు చేసిన ఆరోపణల్లో రాజకీయ కోణం లేకుంటే... భావోద్వేగం మీద రాజకీయం చేసే ఉద్దేశమే లేకుంటే.. నెయ్యికి బదులు జంతువుల నూనెలు నిజంగా వాడి ఉంటే... తక్షణమే ఉన్నత స్థాయి కమిటీ వేయాలని షర్మిల డిమాండ్ చేశారు. అలాగే సీబీఐతో విచారణ జరిపించాలని కోరారు. మహా పాపానికి.. ఘోర అపచారానికి పాల్పడిన నీచులెవరో తేల్చండని ఆమె సవాల్ విసిరారు. చంద్రబాబు తన వ్యాఖ్యలకు కట్టుబడి ఉండాలని, నిజాలు నిగ్గు తేల్చాలని షర్మిల డిమాండ్ చేశారు.

## 15 ఏళ్లు దాటిన వాహనాలకు రోడ్లపైకి నో పర్మిషన్

మొదటి పేజి తరువాయి

వాహనాలకు ఫిట్ నెస్ పరీక్షలు

ఫిట్ నెస్ పరీక్షల్లో పాసైన వాహనాలు గ్రీన్ ట్యాక్స్ చెల్లిస్తే మరో మూడు నుంచి 5 ఏళ్ల పాటు పనిచేసేందుకు అనుమతిస్తారు. అయితే 15 ఏళ్లు దాటిన ప్రభుత్వ వాహనాలను కూడా స్క్రాప్ చేయనున్నారు. ఇలాంటి వాహనాలను ప్రభుత్వ శాఖల్లో 10 వేలు ఉన్నాయి. దిల్లీలో మాత్రమే ప్రస్తుతం 15 ఏళ్లు దాటిన వాహనాలను రోడ్లపైకి అనుమతించడం లేదు. కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్ సహా ఇతర రాష్ట్రాలు ప్రతిపాదించిన విధానాలను తెలంగాణలో కూడా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

గ్రేటర్ లో 20 లక్షల వాహనాలు

తెలంగాణలో 15 ఏళ్లు దాటిన వాహనాలు 30 లక్షలకు పైగా ఉన్నాయి. అయితే గ్రేటర్ హైద్రాబాద్ పరిధిలోనే ఈ వాహనాలు 20 లక్షలున్నాయని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. ఇందులో 17 లక్షల ద్విచక్రవాహనాలు, 3.5 లక్షల కార్లు, లక్ష గూడ్స్ క్యారేజీలు, 20 వేల ఆటోరిక్షాలున్నాయి.

స్క్రాప్ చేయాల్సిన లిస్ట్ లో 1000 ఆర్టీసీ బస్సులు

15 ఏళ్లు దాటిన వాహనాల జాబితాలో వెయ్యి ఆర్టీసీ బస్సులున్నాయి. పలు విద్యా సంస్థల బస్సులు 2 వేలు 15 ఏళ్లు దాటినట్టుగా అధికారులు గుర్తించారు. పాత వాహనాలను స్క్రాప్ చేసిన యజమానులకు మోటార్ వాహనాల పన్నుపై 10 నుంచి 15 శాతం వరకు రాయితీని ఇచ్చే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.కేంద్ర రోడ్డు రవాణ, రహదారుల మంత్రిత్వ శాఖ నివేదిక మేరకు 15 ఏళ్లు దాటిన వాహనాలతో వెయ్యి రోడ్డు ప్రమాదాలు నమోదయ్యాయి. 2022లో ఈ వాహనాలతో 1,306 ప్రమాదాలు జరిగాయి. ఈ ప్రమాదాల్లో 418 మంది చనిపోయారు. ముఖ్యంగా 15 ఏళ్లు పైబడిన వాహనాలు తరచుగా పాడైపోతున్నాయని రోడ్డు భద్రతా నిపుణులు చెబుతున్నారు.

## జమిలికి బీఆర్ఎస్ స్వాగతమేనా ?




మొదటి పేజి తరువాయి

ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. శీతాకాల సమావేశాల్లో దీనిని పార్లమెంట్ ముందుకు తెచ్చి చట్టం చేయించుకుంటారు. ఇలా బీజేపీ వడివడిగా అడుగులు వేస్తుంది. అయితే కేంద్ర మంత్రి వర్గం ఎపుడైతే జమిలి ఎన్నికలకు ఓకే అంటూ ముందుకు వచ్చిందో ఆ వెంటనే కాంగ్రెస్ దానిని ఖండించింది. జమిలి ఎన్నికలు ఈ దేశంలో అసాధ్యమని తేల్చేసింది. ఆ విధంగా జరగకూడదని కూడా తన మనసులో మాటను బయటపెట్టింది. అంటే కాంగ్రెస్ భావన ఇదే అయితే ఇండియా కూటమిలోని మిగిలిన పార్టీల ఆలోచనలు కూడా ఇలాగే ఉంటాయని వేరేగా చెప్పాల్సిన అవసరం లేదు. వామపక్షాలు అయితే ఇది జాతీయ వాదాన్ని తెచ్చి ప్రాంతీయ వాదం మీద రాష్ట్రాల మీద రుద్దడం అని అంటున్నాయి. మొత్తానికి బీజేపీకి ఇండియా కూటమి ఈ విషయంలో పూర్తి వ్యతిరేకం అని అర్థం అయింది. మరో వైపు ఎన్డీయే పక్షాలు ఎలా రియాక్టు అవుతాయన్నది చూడాల్సి ఉంది. బీజేపీతో పాటు అనేక ఇతర పార్టీలు ఎన్డీయేలో ఉన్నాయి. ఇంకో వైపు తటస్థ పార్టీల మీద అందరి చూపు పడుతోంది. తటస్థ పార్టీలు అంటే అటు ఎన్డీయే ఇటు ఇండియా కూటమిలో చేరనివి అని చెప్పాలి. తెలుగు రాష్ట్రాలలో అలా చూసుకుంటే ఏపీలో వైసీపీ తెలంగాణలో బీఆర్ఎస్ ఉన్నాయి. వైసీపీ జమిలి ఎన్నికల మీద తన స్టాండ్ ఏంటో ఇంకా చెప్పలేదు. అయితే బీఆర్ఎస్ మాత్రం ఇండైరెక్ట్ గా అంగీకరించిందా అన్న చర్చ సాగుతోంది. ఎందుకంటే సుమారుగా ఏడాది క్రితం తెలంగాణాలో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ కి జమిలి ఎన్నికల రూపంలో మరో చాన్స్ వస్తే నో అనకుండా ఉంటుందా అన్నదే అందరి మాట. దీని మీద బీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీయార్ కొంత నర్మగర్భంగా ట్వీట్ పెట్టారు. జమిలి ఎన్నికలు అంటున్నారు కదా దేశంలో ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వాలను రద్దు చేస్తారా అని ఆయన ప్రశ్నించారు. అది ఆయనకు వచ్చిన డౌటా లేక జమిలి విషయంలో కేంద్రం స్టెప్స్ ఏంటి అని తెలుసుకోవడమా అన్నది అయితే తెలియదు. మరో వైపు జమిలి ఎన్నికల ప్రతిపాదన మీద కాంగ్రెస్ మాదిరిగా ఆయన స్ట్రైట్ గా కొట్టిపారేయకుండా తమ పార్టీలో చర్చించిన మీదటనే జమిలి ఎన్నికల మీద నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. జమిలి ఎన్నికలు అంటే తెలంగాణా ప్రభుత్వం కూడా రద్దు అవుతుంది. మళ్లీ ఎన్నికలు వస్తాయి అందుకే విపక్షంలోని బీఆర్ ఎస్ లాంటి పార్టీలకు సుముఖమే అని అంటున్నారు. మరి అధికారంలో ఉన్న పార్టీలకు మాత్రం ఇది ఇబ్బందికరమే అని అంటున్నారు. మొత్తానికి మోదీ ప్రభుత్వం కేంద్రంలో అధికారంలో ఉన్న తమతో పాటు ఎవరికీ అయిదేళ్ళు గ్యారంటీలేదు అన్న చేదు సందేశాన్ని అందిస్తోంది

## సామ్, మామ్ పిల్లలపై పర్యవేక్షణ పెంచాలి

### ఐ.సి.డి.ఎస్.సి.డి.పి. ఓ నిర్మల జ్యోతి.



కల్లూరు(ప్రభాత సూర్యుడు): అంగన్వాడి కేంద్రాల పరిధిలో గుర్తించిన సామ్,మామ్ పిల్లల పై సూపర్వైజర్లు, అంగన్వాడీ టీచర్లు పర్యవేక్షణ పెంచాలని సిడిపిఓ నిర్మల జ్యోతి అన్నారు. మాస్టర్ ట్రైని సిడిపిఓ కనకదుర్గ ఆధ్వర్యంలో గురుకుల పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో నిర్మలా జ్యోతి మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఎత్తుకు తగ్గ బరువులేని పిల్లలను గుర్తించి శామ్, మామ్ పిల్లలుగా పరిగణిస్తామని పిల్లల ఆరోగ్యము సాధారణ స్థితికి వచ్చేవరకు ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహిస్తామన్నారు. ఖమ్మం డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ కొమ్మినేని బాబు,వరంగల్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మహేష్ మాట్లాడుతూ సామ్,మామ్ పిల్లలకు ప్రభుత్వ వైద్యులచే వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యుల సలహా మేరకు అవసరమైన మందులు, అదనపు ఆహారం అందిస్తామని, అవసరమైతే న్యూట్రిషన్ రీహబిటేషన్ సెంటర్స్, ఎన్ ఆర్ సి కి పంపించి అక్కడ పూర్తిస్థాయి పర్యవేక్షణ నిర్వహిస్తామన్నారు. ఏ సిడిపివోలు రత్తమ్మ, మమెహరున్నిసా బేగం, మహబూబ్ అలీ ఐదు మండలాల ఐసిడిఎస్ సూపర్వైజర్లు, వైద్య ఆరోగ్యశాఖ నుంచి ఐదు మండలాల పీహెచ్సీల హెల్త్ సూపర్వైజర్లు, సత్తుపల్లి ప్రాజెక్టు కోఆర్డినేటర్ ప్రసాదు, కల్లూరు ప్రాజెక్టు కోఆర్డినేటర్ హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## సాగర్ జలాలు వెంటనే విడుదల చెయ్యాలి అనీ కోరిన సత్తుపల్లి ఎమ్మెల్యే



సత్తుపల్లి(ప్రభాత సూర్యుడు): ఖమ్మం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ని మర్యాద పూర్వకంగా కలుసుకొని సాగర్ కాలువ కు ఇటీవల వరదలు వల్ల గండ్లు పడటం తో నీళ్లు రాక రైతుల పొలాలు ఎండిపోతున్నాయి అని, త్వరగా సాగర్ కాలువ పనులు పూర్తి చేసి రైతులకు పంట పొలాలకు నీళ్లు అందించాలి అని కలెక్టర్ ని కోరిన నియోజకవర్గం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్. సత్తుపల్లి సింగరేణి ప్రభావిత ప్రాంతాల గ్రామాల గురించి మరియు వరదలు వల్ల సత్తుపల్లి నియోజకవర్గం లో జరిగిన నష్టం గురించి జిల్లా కలెక్టర్ కి తెలియజేసిన సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ మరియు రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్.

## సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు జాగ్రత్త వహించాలి -డాక్టర్ రమేష్



అబ్దుల్లాపూర్ మెట్ (ప్రభాత సూర్యుడు): సీజనల్ వ్యాధులు ప్రభలకుండా ప్రజలు జాగ్రత్తలు వహించాలని పసుమామల గ్రామ బస్తీ దవఖాన డాక్టర్ రమేష్ ఒక ప్రకటనలో అన్నారు. వర్షాకాల సమయంలో దోమలు అధికమవుతాయని, తద్వారా సీజనల్ వ్యాధులు, అంటు రోగాలు అధికంగా వ్యాప్తి చెందే అవకాశం ఉంటుంది కావున, ప్రజలు ఎప్పటికప్పుడు తగు జాగ్రత్త చర్యలు చేపట్టాలని తెలిపారు. దోమల బారిన పడకుండా ఇంటి చుట్టుపక్కల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం, ఎప్పటికప్పుడు దుస్తులను శుభ్రపరచుకొని, ఉతికిన బట్టలను వాడాలని, రోగులను తాకకుండా దూరం పాటిస్తూ తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. దగ్గు,జలుబు,జ్వరం మరియు శరీరం నీరసం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం వహించకుండా వెంటనే ప్రాథమిక చికిత్స కేంద్రాలను, బస్తీ దవాఖానాలను సంప్రదించి వైద్య పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రమేష్ కోరారు.

## డ్రైనేజీలు లేకుండానే సిసి రోడ్లకు శ్రీకారం



అబ్దుల్లాపూర్ మెట్ (ప్రభాత సూర్యుడు): డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకుండానే సిసి రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ ఇంజనీరింగ్ అధికారులు. 10 లక్షల రూపాయల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేసిన తర్వాతనే రోడ్లను ఏర్పాటు చేయవలసి ఉంటుంది. ఈ నిబంధనాలను అధికారులు మరిచారేమో తెలియదు గాని, నిబంధనలకు విరుద్ధంగా నిధులను దుర్వినియోగం చేస్తూ సీసీ రోడ్ నిర్మాణ బాధ్యతలను ఏకంగా కాంట్రాక్టర్లకు అప్పజెప్పారు. దీంతో సదరు కాంట్రాక్టర్ చకచక పనులు మొదలుపెట్టి మున్సిపాలిటీ అధికారులకు సమాచారం లేకుండానే స్థానిక కౌన్సిలర్ చేత ప్రారంభోత్సవ కార్యక్రమాలు కూడా చేయించారు. ఇంత జరుగుతున్నా అధికారులకు మాత్రం ఎలాంటి ప్రారంభోత్సవాలు జరగలేదని, తమకేమీ సమాచారం లేదని తెలియనట్లు వ్యవహరించడం విస్మయానికి గురిచేస్తుంది. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని 4వ వార్డులోని యాదాద్రి నగర్ కాలనీలో గత వారం రోజుల క్రిత సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన జరగడంతో స్థానికుల నుండి పలు విమర్శలు ఎదురయ్యాయి. డ్రైనేజీ వ్యవస్థ లేకుండా సిసి రోడ్లు ఏర్పాటు చేయడం ఏంటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. సదుపాయాలు అవసరమే కానీ, నిధులు దుర్వినియోగం కాకుండా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడం మంచిదని పలువురు సూచిస్తున్నారు. ఇదే విషయమై మున్సిపాలిటీ డిఈ శివానందంను వివరణ కోరగా, దీనిపై పలు ఫిర్యాదులు వచ్చాయని, వెంటనే పనులను ఆపాలని, తదుపరి ఆదేశాలు వచ్చేంతవరకు సిసి రోడ్డు పనులు జరపరాదని ఆదేశించినట్లు తెలిపారు.

## వేలంపాటలో గణపతి లడ్డుని దక్కించుకున్న కుకుట్లపల్లి నరేందర్



అబ్దుల్లాపూర్ మెట్ (ప్రభాత సూర్యుడు): గణేష్ నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని అబ్దుల్లాపూర్ మెట్ మండల పరిధిలో ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. పెద్ద అంబర్ పేట్ మున్సిపాలిటీ పరిధిలోని తట్టి అన్నారం గ్రామంలో హనుమాన్ టెంపుల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణేష్ మండపం వద్ద ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. నిత్యం వేద బ్రాహ్మణులచే పూజా కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి గ్రామస్తులను ఆకట్టుకున్నారు. 13 రోజుల కార్యక్రమాల అనంతరం గురువారం నిమజ్జన ఉత్సవాలను నిర్వహించారు. అందులో భాగంగా లడ్డు వేలం పాటను నిర్వహించారు. హెూరాహెూరీగా సాగిన లడ్డు వేలం పాట కార్యక్రమంలో భక్తులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఈ వేలం పాటలో హనుమాన్ టెంపుల్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గణపతి మండపం లడ్డూను కుకుట్లపల్లి నరేందర్ 69 వేల రూపాయలకు లడ్డూను దక్కించుకున్నారు. మండప నిర్వాహకులు భాజా భజంత్రీలు నడుమ భారీ ఊరేగింపుతో లడ్డూను నరేందర్ ఇంటికి చేర్చారు. ఈ సందర్భంగా లడ్డు కైవసం చేసుకున్న కుకుట్లపల్లి నరేందర్ మాట్లాడుతూ.. అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించిన గణపతి లడ్డును దక్కించుకోవడం ఆనందంగా ఉందని తెలిపారు. ఆదిదేవుడు గణపతి ఆశీర్వాదాలు గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కోరినట్లు తెలిపారు.

# సాగర కాలువ గండ్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తులు జరగాలి

### ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ ని కోరిన మంత్రి తుమ్మల.



ఖమ్మం(ప్రభాత సూర్యుడు): అధికారులు అలసత్వం వీడాలి ఏ ఒక్క రైతుకు నష్టం లేకుండా చూడాలి రెండు రోజుల్లో మరమ్మత్తులు పూర్తి చేయాలి అధికారులకు మంత్రి తమ్మల ఆదేశం. సాగర్ ఎడమ కాలువ గండ్లను యుద్ధ ప్రాతిపదికన పూడ్చాలని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ ని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. రాష్ట్రంలో తుఫాను ప్రభావంతో వరదల వల్ల నాగార్జున సాగర్ ఎడమ కాలువ కు గండ్లు పడ్డాయని కాలువమరమ్మత్తు పనులు త్వరగతిన చేపట్టాలని ఆయన కోరారు ఈ మేరకు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా కు సూచించారు. కాలువ మరమ్మత్తులు పనులు నత్తనడకన సాగుతూ ఉండటంతో మంత్రి తుమ్మల అధికార యంత్రాంగంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతాంగం కు నష్టం లేకుండా పంటలు ఎండి పోకుండా ఇరిగేషన్ అధికారులు రెండు రోజుల్లో మరమ్మత్తు పనులు పూర్తి చేసి సాగర్ ఆయకట్టు కు నీరు విడుదల చేయాలని మంత్రి తుమ్మల సూచించారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల ఏ ఒక్క రైతుకు ఇబ్బంది కలగకూడదని సూచించారు. యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకోని సాగర్



ఆయకట్టు రైతులకు నీరు అందించాలని ఆదేశించారు. తుమ్మల ఫోటో మ్యాటర్ మధ్యలో రౌండ్ గా రావాలి. అలాగే సైట్ ఫోటో పెద్దగా రావాలి వీలైతే మెయిన్ పేపర్ లో ప్రింట్ వెయ్యగలరు.

# ప్రజల కల సాకారం...జిల్లా ఆసుపత్రి ప్రారంభం

- జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాలను ప్రారంభించిన మంత్రులు దామోదర రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండా సురేఖ
- అమృత్ 2.0 పథకం ద్వారా త్రాగునీటి సరఫరా ట్యాంకు భూమి పూజ చేసిన మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కొండ సురేఖ
- నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్, వైద్య కళాశాలకు పాకాల వైద్య కళాశాలగా నామకరణం చేయాలి... ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి





నర్సంపేట/వరంగల్,(ప్రభాత సూర్యుడు): పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా ఆసుపత్రి, మెడికల్ కళాశాలను గురువారం తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ జిల్లా ఇన్చార్జ్ మంత్రి రెవెన్యూ, హౌసింగ్, సమాచార



పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖలతో కలిసి ప్రారంభించారు. హెలిపాడ్ వద్ద మంత్రులకు కలెక్టర్ సత్య శారద, స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి స్థానిక శాసనసభ్యులు దొంతి మాధవరెడ్డి అధ్యక్షత వహించి మాట్లాడారు. నర్సంపేటకు నర్సింగ్ కళాశాల, పారా మెడికల్ కళాశాల మంజూరు చేయాలని విన్నవించారు. వైద్య కళాశాలకు పాకాల కళాశాలగా నామకరణం చేయాలని, ఇంటిగ్రేటెడ్ స్కూల్ నియోజకవర్గానికి మంజూరు చేయాలని ఎమ్మెల్యే దొంతి కోరారు. అనంతరం వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ 28 కోట్లతో నర్సింగ్ కళాశాల, 30 కోట్లతో పారా మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడానికి మంజూరు ఇప్పిస్తానని హామీ ఇచ్చారు. ప్రస్తుతం ప్రారంభించిన వైద్యశాల, వైద్య కళాశాలలో పూర్తిస్థాయి పరికరాలతో పాటు ప్రొఫెసర్లను, అసోసియేట్ ప్రొఫెసర్లను, అసిస్టెంట్ ప్రొఫెసర్లను, అధ్యాపకులను ఇతర సిబ్బందిని నియమిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా 10 లక్షల వరకు పేద ప్రజలకు వైద్యం చేసుకునే సౌకర్యాన్ని తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం సౌకర్యం కల్పించిందన్నారు. నాడు స్వర్గీయ ముఖ్యమంత్రి డా.వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్య శ్రీ పథకాన్ని ఏర్పాటు చేస్తే గత పది సంవత్సరాల టిఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా అదనంగా చెల్లించలేదని, ఈనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 40 శాతం అదనంగా చెల్లిస్తున్నట్లు చెప్పారు.

### బీఆర్ఎస్ పై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తిన పొంగులేటి....

గత ప్రభుత్వం ఎంతో గొప్పగా ప్రచారం చేసుకున్న మిషన్ భగీరథలో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని మంత్రి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. రూ.46 వేల కోట్ల ఈ ప్రాజెక్టులో 15 వేల నుంచి 20 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించామని 53 శాతం ఇండ్లకు మంచినీరు అందడం లేదని సర్వే రిపోట్లు స్పష్టంగా బయట పెట్టాయన్నారు. గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయానికి బడ్జెట్ లో రూ.72 వేల కోట్లు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. 27 రోజుల్లో 23 లక్షల మందికి రూ.18 వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేశామని పేర్కొన్న ఆయన కొన్ని సాంకేతిక కారణాలతో కొంత మంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని, వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతీ రైతన్నకు రుణమాఫీ చేస్తామన్నారు. ఇచ్చిన మాట ప్రకారం 31 వేల కోట్ల రూపాయలకు ఇంకా రెండు మూడు వందల కోట్లు ఎక్కువైనా పర్వాలేదు అర్హులైన ప్రతీ రైతన్నకు కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు లక్షల రూపాయలు వరకు రుణమాఫీ చేసి తీరుతుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు వేరు వేరుగా అందించబోతున్నామని ప్రకటించారు. మరి కొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు వేయబోతున్నామని, ఈ ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడించారు. అమృత్ 2.0 పథకం ద్వారా వచ్చిన 30.49 కోట్ల రూపాయలను ఖర్చు చేసి త్వరితగతిన పనులు



పూర్తి చేసి నర్సంపేట పట్టణ ప్రజలకు 365 రోజులు 24 గంటలు మంచినీటిని అందించాలని ఇంజనీరింగ్ అధికారులను మంత్రి పొంగులేటి ఆదేశించారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ పార్టీకి అండగా కార్యకర్తలు ఉన్నారని, కార్యకర్తలకు అండగా మేము మాతో పాటు ప్రభుత్వం ఉంటుందని చెప్పారు. ఇది పేద ప్రజల ప్రభుత్వమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రతీ పేద బడుగు బలహీన వర్గాల లబ్ధిదారులకు పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ రామచంద్రనాయక్, పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, కె.ఆర్. నాగరాజు, మురళి నాయక్, మాజీ మంత్రి ఎమ్మెల్సీ బస్వరాజ్ సారయ్య, కార్పొరేషన్ చైర్మన్లు ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, కూడా చైర్మన్ వెంకటరామిరెడ్డి, రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ రియాజ్ , సీడ్స్ చైర్మన్ అన్వేష్ రెడ్డి, కలెక్టర్ సత్య శారద, నర్సంపేట మున్సిపల్ చైర్ పర్సన్ గుంటి రజిని కిషన్, కౌన్సిలర్లు, ప్రభుత్వ ఉన్నత అధికారులు, పోలీసు అధికారులు, వైద్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# మెడికల్ కళాశాల తెచ్చిన మాపై నిర్బందమా..?



### పరిపాలన చేతకాక, వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే అక్రమ అరెస్టులు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి

నర్సంపేట/వరంగల్, సెప్టెంబర్ 19, ప్రభాత సూర్యుడు ప్రతినిధి : పరిపాలన చేతగాక కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ అరెస్టులకు తెర లేపిందని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ సీనియర్ నేత పెద్ది సుదర్శన్ రెడ్డి మండిపడ్డారు. గురువారం పట్టణంలో జిల్లా ఆసుపత్రి, వైద్య కళాశాల ప్రారంభోత్సవ నేపథ్యంలో బీఆరెస్ మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డితో పాటు పార్టీ నాయకులను హౌస్ అరెస్ట్ చేశారు.

### ఈ సందర్బంగా పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్ రావుల సహాకరంతో నేను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ప్రజల అవసరం మేరకు జిల్లా స్థాయి ఆసుపత్రి నర్సంపేటకు కావాలని కొట్లాడి ప్రజలకు నాణ్యమైన వైద్యం కోసం ముందు చూపుతో ఆనాడే జిల్లా ఆసుపత్రిని మంజూరు చేయించానన్నారు. ప్రభుత్వానికి స్థలాన్నిచ్చి 183 కోట్ల రూపాయల మంజూరీ తీసుకొచ్చి, టెండర్లు పిలిచి, భూ యజమానులతో సమన్వయం చేసుకుని, వారి కుటుంబాలకు ఉద్యోగ ఉపాది కల్పిస్తామని మాట ఇచ్చి నిర్మాణాన్ని పూర్తి చేసిన మాపై నిర్భందాలెందుకని ప్రశ్నించారు. దూరదృష్టితో ఆలోచించాం కాబట్టే ఇంతటి విజయం సాదించామని, జిల్లా ఆసుపత్రి ఉంటే మెడికల్ కళాశాల వస్తుందనే ఆలోచనలు ఫలించాయన్నారు. జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలన్న కేసీఆర్ ఆలోచనతో వరంగల్ జిల్లాకు సంబంధించి మెడికల్ కళాశాల నర్సంపేటకు రావాలని, అందుకు ముందస్తు అన్ని రకాల వసతులతో కూడిన పీజి, జిల్లా ఆసుపత్రి నిర్మితమై ఉంది కాబట్టి మెడికల్ కళాశాల ఇవ్వాలని ఆనాడు కొట్లాడిన. నా కల నెరవేరింది, మెడికల్ కళాశాల మంజూరీ వచ్చింది, పూర్తి అయ్యింది, ప్రభుత్వాలు మారినా పాలన నిరంతరం అయిందన్నారు. అన్ని రకాల అనుమతులతో కూడిన మెడికల్ కళాశాల ప్రారంభించడం నర్సంపేట నియోజకవర్గ ప్రజలకు దక్కిన అరుదైన గౌరవంగా బీఆర్ఎస్ పార్టీ బావిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నడపడం రాక, వాళ్ళు చేసిందేమి లేక చేతగాని పాలనను ప్రజలు గ్రహిస్తున్నారనే ఉద్దేశ్యంతో అర్థరాత్రి అక్రమ అరెస్టులకు తెరలేపిందని ఏద్దేవా చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా బీఆర్ఎస్ మాజీ ప్రజాప్రతినిదులను,నాయకులను,కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్లలో బందించారు..కొందరిని పక్క నియోజకవర్గ పోలిస్ స్టేషన్లలో బందించారు..ఈ నిర్బంధకాండ ను తీవ్రంగా ఖండిస్తున్నాం.. మెడికల్ కళాశాలకు కర్త, కర్మ, క్రియ నేనని నల్లబెల్లిలో నా ఇంట్లో ఉన్న నన్ను పోలీసులు గృహనిర్భందం చేయడం హేయమన్నారు. ఎక్కడా బీఆర్ఎస్ పార్టీ నిరసన తెలపలేదని, మేమే పండుగ వాతావరణానికి పిలుపునిచ్చి శుభాకాంక్షలు తెలిపిన తర్వాత మమ్మల్ని అక్రమంగా ఎందుకు నిర్బందించి అవమానిస్తున్నారో కాంగ్రెస్ మంత్రులు సమాదానం చెప్పాలన్నారు. నాలుగు రోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి లేఖ రాశానని, ప్రారంభోత్సవానికి రండి మేం తెచ్చిన పథకాలు, నిదులు నిల్వ ఉండి వృదాగా పోతున్నాయి, మెడికల్ కళాశాలకు సంబంధించి 100 కోట్ల నిదులు మాత్రమే ఖర్చు అయ్యాయి, ఇంకా 183 కోట్లు ఇతర పనుల కోసం టెండర్లు పిలవాల్సి ఉందని. 50 సీట్లతో కూడిన మెడికల్ కళాశాలకు మాత్రమే మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇచ్చిందని భవిష్యత్ లో 150 సీట్లకు అనుమతి వస్తుందని, రోడ్లు పనులు, అనేక రకమైన అభివృద్ధి పనులు రద్దవుతున్నాయని కోరుతూ సీఎం ను రమ్మని కోరిన. నియోజకవర్గం అభివృద్ధిపై దృష్టిపెట్టండి, సమీక్ష జరపండి అంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశా. రాజకీయాలకు సమయం కాదు నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమని జెప్పిన. మాపై ఈ నిర్భందాలు ఎందుకు. మేం నిరసన ప్రకటించలేదుగా అని సూటిగా ప్రశ్నించారు. బీఆర్ఎస్ పార్టీ ఆశీర్వాదంతో వచ్చిన మెడికల్ కళాశాల, జిల్లా ఆసుపత్రి నిర్మాణం, దానికోసం గొప్ప సహాయం చేసిన వ్యాపారవెత్త దొడ్డ మోహన్ రావు, త్యాగాలు చేసిన రైతుల కుటుంబాలను గౌరవించుకోవాల్సిన పండగ, ఈ ప్రాంతంలో సేవలందించిన వైద్యులను సన్మానించుకునే సందర్బం ఇదన్నారు. రాష్ట్రంలోనే అన్ని రకాల విద్యాసంస్థలు ఉన్న ఏకైక నియోజకవర్గంగా నర్సంపేటను తీర్చిదిద్దామని, ఈ ప్రాంత విద్యకు సహకరించిన, మేదావులను సన్మానించుకోవాల్సిన సందర్బం మరచి మెడికల్ కళాశాల తెచ్చిన మా పార్టీ ప్రతినిదులను ఎందుకు అరెస్ట్ చేసారో మంత్రులు సమాదానం చెప్పాలన్నారు. 5 ఏండ్లలో నియోజకవర్గం ప్రశాంతంగా ఉంది. నిర్బంద రాజకీయాలు, కక్ష రాజకీయాలు మేమేనాడు చేయలేదు. మార్పులో బాగంగా నిర్బంధ పాలనకు తెరతీసింది కాంగ్రెస్ ప్రభుత్వమని, ప్రజాపాలన పేరుతో జరుగుతున్న అక్రమ నిర్బందాలు, గాడితప్పిన పాలనపై ప్రజలే తగిన గుణపాఠం చెపుతారని పెద్ది సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు.

# దేవుడు ఎప్పుడో శిక్షించాడు..

## అయినా మారలేదు-చంద్రబాబుపై భూమన షాకింగ్..!



**అమరావతి,:** గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుపతి లడ్డూ ప్రసాదం తయారీపై సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు తీవ్ర కలకలం రేపాయి. అప్పట్లో నెయ్యికి బదులు జంతువుల నూనెలతో ప్రసాదం తయారు చేయించారంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలపై రాష్ట్రవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వంలో టీటీడీ ఛైర్మన్ గా పనిచేసిన భూమన కరుణాకర్ రెడ్డి ఇవాళ తీవ్రంగా స్పందించారు. చంద్రబాబుపై ఆయన తీవ్ర విమర్శలు చేశారు. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరస్వామి దివ్యక్షేత్రం తిరుమల ప్రసాదాలపై సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణలు అత్యంత దుర్మార్గమని, రాజకీయ లబ్ధికోసం, రాజకీయ స్వార్థకోసం భగవంతుడ్ని వాడుకునే వారిని భగవంతుడు క్షమించడని భూమన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో ఎలాంటి సందేహం లేదన్నారు. శ్రీవేంకటేశ్వర స్వామి దుష్టశిక్షణ చేస్తాడని స్వయంగా చంద్రబాబే పలుమార్లు చెప్పిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కాబట్టి ఇలాంటి నీచమైన ఆరోపణలు చేసిన వ్యక్తిని భగవంతుడు చూస్తూ ఊరుకోడన్నారు. రాజకీయ ప్రత్యర్థులను దృష్టిలో ఉంచుకుని భగవంతుడి పేరుమీద ఆరోపణలు చేయడం చంద్రబాబుకు కొత్తేమీ కాదని, గతంలో వైయస్ఆర్ సీఎంగా ఉన్నప్పుడు కూడా చంద్రబాబు ఇలాంటి ఆరోపణలు చేసిన సందర్భాలున్నాయని గుర్తుచేశారు.దీనికి అప్పుడు భగవంతుడు శిక్ష కూడా విధించాడన్నారు. అయినా చంద్రబాబు మారలేదన్నారు. ఇప్పుడు మళ్లీ అలాంటి ఆరోపణలే చేస్తున్నాడన్నారు. తిరుమలలో అన్నప్రసాదాలు తయారు చేసే విషయంలో అధికారులకు ఎలాంటి ప్రమేయం ఉండదనేది అసలు వాస్తవమని భూమన తెలిపారు. పవిత్రమైన శ్రీ వైష్ణవుల అమృత హస్తాల మీదుగా ఈ పదార్థాలు తయారవుతాయని, ప్రసాదాల్లో పదార్థాల వినియోగం వారి చేతులమీదుగా ఉంటుందన్నారు. అలాంటి వారి హస్తాలమీదుగా తయారయ్యే ప్రసాదాలమీద చంద్రబాబు ఆరోపణలు చేస్తున్నాడంటే..ఆయన బురదరాజకీయాలకు పరాకాష్ట అన్నారు.ఈ దఫా అధికారంలోకి వచ్చింది మొదలు తిరుమల వేదికగా చంద్రబాబు చేసిన విషప్రచారాలు అన్నీ ఇన్నీకావన్నారు. చివరకు ఏమీ దొరక్కపోవడంతో ఇలాంటి తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నాడంటూ భూమన మండిపడ్డారు.

# టొరెంట్ పవర్ భారీ పెట్టుబడులు




గాంధీనగర్: ప్రయివేట్ రంగ కంపెనీ టొరెంట్ పవర్ పునరుత్పాదక(గ్రీన్) ఇంధన ప్రాజెక్టులపై భారీ పెట్టుబడులకు తెరతీయనుంది. గ్రీన్, సస్టెయినబుల్ ఎనర్జీ ప్రాజెక్టులపై మొత్తం రూ. 64,000 కోట్లుపైగా ఇన్వెస్ట్ చేయనుంది. తద్వారా 26,000 మందికి ఉపాధి కల్పించే అవకాశముంది. ఈ బాటలో పెట్టుబడుల కట్టుబాటును ప్రదర్శిస్తూ కేంద్ర పునరుత్పాదక ఇంధన శాఖకు రెండు శపథ పత్రాలను దాఖలు చేసింది. పరిశ్రమల సమాఖ్య(సీఐఐ)తో కలసి పునరుత్పాదక ఇంధన శాఖ నిర్వహించే ఆర్ఈ-ఇన్వెస్ట్ 4వ సదస్సులో భాగంగా టొరెంట్ పవర్ 2030కల్లా 10 గిగావాట్ల పునరుత్పాదక ఇంధన సామర్థ్యాన్ని అందుకునే లక్ష్యాన్ని ప్రకటించింది. తొలి శపథ పత్రంలో భాగంగా సుమారు రూ. 57,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 25,000 మందికి ఉద్యోగావకాశాలు లభించే వీలుంది. ఇందుకు ద్వారకలో 5 గిగావాట్ల సోలార్ లేదా విండ్ లేదా రెండింటి కలయికతో హైబ్రిడ్ పవర్ ప్రాజెక్టును ఏర్పాటు చేసేందుకు గుజరాత్ ప్రభుత్వంతో తాజాగా అవగాహనా ఒప్పందాన్ని(ఎంవోయూ) కుదుర్చుకుంది. ఇక రెండవ శపథ పత్ర ప్రకారం ఏడాదికి లక్ష కిలో టన్నుల సామర్థ్యంతో గ్రీన్ అమోనియా ఉత్పత్తికి ప్లాంటును ఏర్పాటు చేయనుంది. ఇందుకు రూ. 7,200 కోట్లు వెచ్చించనుంది. తద్వారా 1,000 మందికి ఉపాధి లభించనుంది. దేశంలోని విద్యుత్ రంగ దిగ్గజాలలో ఒకటైన టొరెంట్ పవర్ భారత్ పునరుత్పాదక ప్రయాణంలో భాగమయ్యేందుకు కట్టుబడి ఉన్నట్లు కంపెనీ ఛైర్మన్ సమీర్ మెహతా పేర్కొన్నారు.

# ఎలక్ట్రిక్ స్కూటర్లపై సబ్సిడీ రూ.5 వేలేనా?




ఎలక్ట్రిక్ వాహనాలపై ఇస్తున్న రాయితీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించేసింది. ఫేమ్ స్కీమ్ స్థానంలో ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకాన్ని తీసుకొచ్చింది. ఈ కొత్త స్కీమ? కింద ఎలక్ట్రిక్ టూవీలర్లపై గరిష్టంగా మొదటి సంవత్సరంలో రూ.10,000, రెండో ఏడాదిలో రూ.5,000 సబ్సిడీ మాత్రమే ప్రభుత్వం అందించనుంది. ప్రధానమంత్రి ఈ-డ్రైవ్ పథకానికి సంబంధించిన వివరాలను, ఏయే వాహనానికి ఎంత సబ్సిడీ వస్తుందన్న విషయాలను కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్డీ కుమారస్వామి ఇటీవల వెల్లడించారు. ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలకు పీఎం ఈ-డ్రైవ్ పథకం కింద బ్యాటరీ 'పవర్'ఆధారంగా కిలోవాట్ అవర్కు రూ.5,000 సబ్సిడీని నిర్ణయించినట్లు కుమారస్వామి తెలిపారు. అయితే మొదటి సంవత్సరంలో మొత్తం సబ్సిడీ రూ.10,000 మించదు. రెండవ సంవత్సరంలో ఈ సబ్సిడీ కిలోవాట్ అవర్కు సగానికి అంటే రూ. 2,500కి తగ్గుతుంది. మొత్తం ప్రయోజనాలు రూ. 5,000 మించవు. ఇక ఎలక్ట్రిక్ త్రీవీలర్ కొనుగోలుదారులకు మొదటి సంవత్సరంలో రూ.25,000 వరకు సబ్సిడీ లభిస్తుంది. రెండో ఏడాది రూ.12,500 సబ్సిడీని పొందవచ్చని కుమారస్వామి తెలిపారు. ఎల్ 5 కేటగిరీ (త్రీవీలర్లను తీసుకెళ్లే వాహనాలు) వాహనాలకు మొదటి ఏడాది రూ.50,000, రెండో ఏడాది రూ.25,000 సబ్సిడీ లభిస్తుందని కేంద్ర మంత్రి తెలిపారు.

'ఫేమ్'లో భారీగా సబ్సిడీ

ఫాస్టర్ అడాప్షన్ అండ్ మ్యాన్యుఫ్యాక్చరింగ్ ఆఫ్ ఎలక్ట్రిక్ వెహికల్స్ పథకాన్ని మొదటిసారి 2015 ఏప్రిల్లో ప్రవేశపెట్టారు. ఈ స్కీమ్ రెండో ఫేజ్ను 2019 ఏప్రిల్లో ప్రారంభించారు. ఇది వాస్తవానికి మూడేళ్ల ప్రణాళిక 2022 మార్చి 31న ముగియాల్సి ఉండగా 2024 జూలై 31 వరకు పొడిగించింది. ఈ స్కీమ్ రెండో దశ కాలంలో నమోదైన ఒక్కో ఎలక్ట్రిక్ టూవీలర్పై ప్రభుత్వం ప్రభుత్వం రూ.20,000 రాయితీ అందించేది. ఫేమ్2 ప్రారంభంలో సబ్సిడీ మొత్తం కిలోవాట్ అవర్కు రూ.10,000 ఉండేది. తర్వాత రూ.15000 లకు పెంచినప్పటికీ మళ్లీ తగ్గించింది.

# ప్రసాద్ స్కీం కింద 25 కోట్లతో అన్నవరం దేవస్థానం అభివృద్ధి !



**అమరావతి,:** ప్రసాద్ స్కీం కింద 25 కోట్లతో అన్నవరం దేవస్థానం అభివృద్ధి చేస్తామని ప్రకటించారు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్. 27న విజయవాడలో ప్రపంచ పర్యాటక దినోత్సవం ఉందని.. ఈ సంధర్భంగా వివిధ విభాగాల్లో అవార్డులు ప్రదానం చేస్తామని తెలిపారు. ఏపీలో టూరిజనికి పెద్దపీట వేస్తున్నామని గత వైసిపి ప్రభుత్వం టూరిజన్ని పూర్తిగా నాశనం చేసిందని ఫైర్అయ్యారు. అక్టోబర్ 15న కేంద్రానికి టూరిజం డెవలప్మెంట్ కు నివేదిక అందిస్తామని.. 250 కోట్లు కేటాయించడానికి కేంద్రం ముందుకు వచ్చిందని తెలిపారు. శ్రీశైలం టెంపుల్ టూరిజం అభివృద్ధి చేస్తామని.. అఖండ గోదావరి టూరిజం ప్రాజెక్టు తెస్తున్నాని ప్రకటించారు.బాపట్లలో బీచ్ డెవలప్మెంట్ చేయబోతున్నాం సంగమేశ్వర ప్రాజెక్టును టూరిజం కారిడార్ గా చేస్తామన్నారు. ఎకో టూరిజం ఇందులో ప్రాధాన్యం ఇస్తామని.. పర్యాటకులు టూరిజం కేంద్రాల్లో మూడు, నాలుగు రోజులు ఆహ్లాదకరంగా గడిపేందుకు మౌలిక వసతులు పెంచుతున్నామని వివరించారు. గత ప్రభుత్వం కేవలం ఆరోపణకు విమర్శలకు తప్ప టూరిజం అభివృద్ధి చేయలేదన్నారు. అరకు, లంబసింగి, బొర్రకవేస్ లను ఆభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

# యుద్ధానికి ముగింపు పలకాలి

## గాజాపై ఇజ్రాయెల్ దురాక్రమణకు దిగింది అమెరికా ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ వ్యాఖ్య

## హైతీ శరణార్థులపై ట్రంప్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శ



ఫిలడెల్ఫియా: గాజా స్ట్రిప్లో దురాక్రమణకు దిగిన ఇజ్రాయెల్ ఇకనైనా మారణహోమం ఆపాలని అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ అభ్యర్థి కమలా హారిస్ పిలుపునిచ్చారు. ఇజ్రాయెల్, హమాస్ సాయుధుల మధ్య కాల్పుల విరమణ ఒప్పందమే గాజాస్ట్రిప్ సమస్యకు అసలైన పరిష్కారమని ఆమె అభిప్రాయపడ్డారు. గాజాలోని ప్రతి ఒక్కరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని కాల్పుల విరమణకు ఇరు పక్షాలు ముందుకు రావాలని ఆమె అభిలషించారు. ఫిలడెల్ఫియాలో జరిగిన నేషనల్ అసోసియేషన్ ఆఫ్ బ్లాక్ జర్నలిస్ట్ (ఎన్ఏబీజే)సమావేశంలో కమల పాల్గొని ప్రసంగించారు. దాదాపు 45 నిమిషాలపాటు పలు అంశాలపై ఆమె మాట్లాడారు. పాత్రికేయులు అడిగిన ప్రశ్నలకు తనదైన రీతిలో బదులిచ్చారు. హైతీలు ఇంటి పెంపుడు జంతువులను తింటున్నారంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న చర్చను, వలసదారులను సామూహిక బహిష్కరణ చేస్తామని ట్రంప్ ఇచ్చిన హామీని హారిస్ తప్పుబట్టారు. 'ట్రంప్ ద్వేషపూరిత వ్యాఖ్యలు హానికరం. ఇలాంటి వాటిని సహించకూడదు'అని అన్నారు. ఆర్థిక అంశాలపైనా ఆమె విస్తృతంగా మాట్లాడారు. "అమెరికన్లను ప్రభావితం చేసే పెద్ద సమస్యలలో సరిపడా గృహాలు లేకపోవడం కూడా ఒకటి. నేనుఅధ్యక్షురాలిగా ఎన్నికైతే గృహాల నిర్మాణానికి ప్రైవేట్ సంస్థలతో కలిసి పనిచేస్తా. చైల్డ్ ట్యాక్స్ క్రెడిట్ను 6,000 డాలర్లకు విస్తరిస్తాం. దీంతో అమెరికన్లు తమ ఆదాయంలో ఏడు శాతం కంటే ఎక్కువ మొత్తాలను పిల్లల సంరక్షణకు చెల్లించాల్సిన అవసరం లేదు"అని కమల వ్యాఖ్యానించారు.

### కమలకు నల్లజాతీయుల బాసట

2020 అధ్యక్ష ఎన్నికల్లో నల్లజాతీయుల్లో ఏకంగా 92 శాతం మంది అప్పటి డెమొక్రటిక్ అభ్యర్థి జో బైడెన్కు మద్దతు పలికారు. రిపబ్లికన్ పార్టీ తరఫున నాటి అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్కు కేవలం 8 శాతం మంది నల్లజాతీయులే మద్దతు పలికారు. ఈ సారిసైతం అదే సరళి కనిపిస్తోంది ఎన్ఏఏసీపీ సర్వే తేల్చింది. ఇటీవల విడుదలైన ఎన్ఏఏసీపీ సర్వే ప్రకారం 63 శాతం మంది నల్లజాతి ఓటర్లు కమలా హారిస్కు మద్దతు పలికారు. గతంతో పోలిస్తే డెమొక్రటిక్ పార్టీ నుంచి నల్లజాతీయులు కాస్తంత దూరం జరిగారని చెప్పాలి. అయినప్పటికీ ఇప్పటికీ నల్లజాతీయుల మెజారిటీ మద్దతు కమలకే దక్కడం విశేషం. ఈసారి పోటీలో నిలిచిన ట్రంప్కు కేవలం 13 శాతం మంది నల్లజాతీయులు మద్దతుగా నిలబడినట్లు సర్వే వెల్లడించింది. పెన్సిల్వేనియా, జార్జియా వంటి రాష్ట్రాల్లో నల్లజాతీయుల మద్దతు నిర్ణయాత్మకంగా ఉంటుంది. పెన్సిల్వేనియా అత్యంత కీలకమైన రాష్ట్రం. ఈ రాష్ట్ర ప్రజలను ప్రభావితం చేసే సామర్థ్యం ఎన్ఏబీజేకు ఉందని చెబుతారు. దీంతో వీరిని ఎలాగైనా తమ వైపునకు తిప్పుకోవాలని కమలా హారిస్, ట్రంప్ ఇద్దరూ చెమటోడుస్తున్నారు. అయితే గతంలో ట్రంప్ చేసిన జాత్యాహంకార వ్యాఖ్యల కారణంగా ఇప్పటికీ నల్లజాతీయుల మద్దతు కూడగట్టడం ఆయనకు సంక్లిష్టంగా తయారైంది. జార్జియాలో మూడు వంతుల మంది నల్లజాతీయులే కావడంతో ఇక్కడా వారి ఓటు నిర్ణయాత్మకంగా మారింది.

# అమలుకు సవాళ్లెన్నో!




### రాజ్యాంగానికి 18 సవరణలు చేయాలి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 18: కోవింద్ కమిటీ నివేదికను కేంద్ర క్యాబినెట్ ఆమోదించినప్పటికీ జమిలి ఎన్నికలు ఆచరణ రూపం దాల్చాలంటే ఎన్నో సవాళ్లున్నాయి. అన్నింటికంటే ముఖ్యమైంది రాజ్యాంగ సవరణ. జమిలి కోసం రాజ్యాంగానికి 18 సవరణలు చేయాలని కోవింద్ కమిటీ తన నివేదికలోనే సూచించింది. వీటికి పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. అధికారపక్షమైన ఎన్డీఏకు లోక్సభలో 293 మంది ఎంపీలు, రాజ్యసభలో 119 మంది ఎంపీలున్నారు. రాజ్యాంగ సవరణలు మూడు రకాలుగా జరుగుతాయి. కొన్నింటికి లోక్సభ/రాజ్యసభల్లో సాధారణ మెజారిటీ అవసరం. మరికొన్నింటికి సాధారణ మెజారిటీతోపాటు, 2/3 వంతు మంది సభ్యుల మద్దతు కావాలి. ఇంకొన్నింటికి సగం కన్నా ఎక్కువ రాష్ట్రాల అసెంబ్లీలు ఆమోదం తెలపాల్సి ఉంటుంది. 2/3 మెజారిటీ అవసరమైన పక్షంలో బిల్లు గట్టెక్కడం కష్టమే. ఎందుకంటే, పార్లమెంటు ఉభయసభల్లోనూ ఎన్డీఏకు 2/3 మెజారిటీ లేదు. ఇక రాష్ట్రాల ఆమోదం విషయానికొస్తే.. కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు అంగీకరిస్తాయా అన్నది అనుమానమే. జమిలి వల్ల చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు నిర్దిష్ట కాలపరిమితి కంటే ముందే రద్దు అవుతాయి. దీనికి ఎన్ని రాష్ట్ర ప్రభుత్వాలు సిద్ధపడతాయనేది మరో సవాలు. ప్రస్తుతం బీజేపీకి పార్లమెంటులో సొంతంగా మెజారిటీ లేదు. టీడీపీ, జేడీయూ, పలు చిన్న పార్టీల మద్దతుతో అధికారంలో కొనసాగుతోంది. జమిలి అమల్లోకి రావాలంటే ఆయా పార్టీల మద్దతు కచ్చితంగా అవసరం.

### భారీ యంత్రాంగం అవసరం

ఒకేసారి దేశమంతా ఎన్నికలు నిర్వహించాలంటే ఈవీఎంలు భారీ సంఖ్యలో కావాలి. ఎన్నికల నిర్వహణకు అధికారులు, భారీ సంఖ్యలో భద్రతా సిబ్బంది అవసరం అవుతారు. ఒకవేళ జమిలి ఎన్నికలు అమల్లోకి వస్తే జాతీయ స్థాయి అంశాలే ఎన్నికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది. ఇది జాతీయ పార్టీలకే మేలు చేస్తుంది. రాష్ట్రాల ఆశయాలు, స్థానిక పార్టీల ఉనికి దెబ్బతినే ప్రమాదం ఉంది. రాష్ట్రాల్లో రాజకీయంగా అనిశ్చిత వాతావరణం ఉంటే కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీ దాన్ని అవకాశంగా తీసుకొని సమాఖ్య విధానాన్ని నీరుగార్చే ప్రమాదం ఉంది.

### 47 పార్టీల్లో 32 సమర్థించాయి

పార్టీల పరంగా చూస్తే.. జమిలి ఎన్నికలపై 47 పార్టీలు తమ అభిప్రాయాన్ని కోవింద్ కమిటీకు తెలియజేశాయి. వాటిలో 32 సమర్థించాయి. ప్రస్తుతం వీటి సంఖ్యాబలం 271. 15 పార్టీలు వ్యతిరేకించాయి. వీటి సంఖ్యాబలం 205. కోవింద్ కమిటీకి అభిప్రాయాలు తెలుపని పార్టీలు కూడా ఉన్నాయి. వీటి సంఖ్యాబలం 29. అభిప్రాయం తెలుపని పార్టీల్లో తెలుగుదేశం కూడా ఉంది. అయితే, తాజాగా జమిలికి సైద్ధాంతికంగా తాము మద్దతిస్తామని ఆ పార్టీ తెలిపినట్లుగా ఓ వార్తాసంస్థ ప్రకటించింది. కోవింద్ కమిటీ ఎదుట జమిలికి మద్దతిచ్చిన పార్టీలన్నీ బీజేపీ, దాని మిత్రపక్షాలే. వీటిలో బీజేడీ ప్రస్తుతం బీజేపీతో లేదు. ఆరు జాతీయపార్టీల్లో రెండు (బీజేపీ, నేషనల్ పీపుల్స్ పార్టీ) జమిలికి మద్దతు తెలపగా, నాలుగు (కాంగ్రెస్, ఆప్, బీఎస్పీ, సీపీఎం) వ్యతిరేకించాయి.

# సింధు జలాల ఒప్పందాన్ని సమీక్షించాలి

## 1960 నాటి పరిస్థితులు, నేటి పరిస్థితులు వేరు

## నిబంధనలను సవరించాలి

## పాకిస్థాన్‌కు నోటీసు ఇచ్చిన మోదీ సర్కారు



న్యూఢిల్లీ, : సింధు నదీ జలాల ఒప్పందాన్ని సమీక్షించాలని భారత్ డిమాండ్ చేసింది. 1960లో పాక్తో కుదిరిన ఈ ఒప్పందాన్ని పునఃపరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ఈ మేరకు మోదీ సర్కారు పాకిస్థాన్కు నోటీసు ఇచ్చింది. సింధు నదీ జలాల ఒప్పందాన్ని సమీక్షించడంతో పాటు నిబంధనల్లో మార్పులు చేయాల్సి ఉందని ఆగస్టు 30న పాక్కు ఇచ్చిన నోటీసులో స్పష్టం చేసింది. ఒప్పందంలోని ఆర్టికల్ 12(3) ప్రకారం ఇరు దేశాలు నిబంధనలను ఎప్పటికప్పుడు సవరించుకోవాల్సి ఉంటుంది. సింధు జలాల ఒప్పందం విషయంలో భారత్ ఉదారంగా వ్యవహరిస్తుండగా.. పాకిస్థాన్ మాత్రం దీన్ని అదనుగా తీసుకొని భారత్ వైపు నిర్మిస్తున్న ప్రాజెక్టులను అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలోనే 1960లో కుదిరిన ఒప్పందాన్ని సమీక్షించాలని డిమాండ్ చేస్తోంది. ఒప్పందం జరిగిన నాటి పరిస్థితులకు, నేటి పరిస్థితులకు మధ్య చాలా మార్పులు చోటుచేసుకున్నాయని, ఒప్పందంలోని పలు అధికరణల కింద సింధు జలాలపై పునఃపరిశీలన అవసరమని పేర్కొంటున్నారు. జనాభా లెక్కలు మారిపోవడంతో వ్యవసాయ, ఇతర అవసరాలకు నదీ జలాల వినియోగం పెరగడంబీ భారతదేశ ఉద్గారాల తగ్గింపు లక్ష్యాలను చేరుకోవడం కోసం స్వచ్ఛ ఇంధనాన్ని అభివృద్ధి చేయడంబీ జమ్మూకశ్మీరులో పాకిస్థాన్ సీమాంతర ఉగ్రవాదాన్ని పెంచిపోషించడం వంటి కారణాల నేపథ్యంలో భారత్ ఈ ఒప్పందంలో తన హక్కులను పూర్తిగా వినియోగించుకోవాలని నిర్ణయించిందని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. రాట్లే, కిషన్గంగా జల విద్యుత్తు ప్రాజెక్టుల నిర్వహణపై సుదీర్ఘకాలంగా వివాదం కొనసాగడం కూడా పాకిస్థాన్కు నోటీసు ఇవ్వడానికి ఓ కారణంగా భావిస్తున్నారు. సింధు జలాల ఒప్పందంపై భారత ఉదారతను పాక్ అవకాశంగా తీసుకుందని ఉన్నతాధికారులు పేర్కొంటున్నారు. మధ్యవర్తిత్వం, తటస్థ నిపుణుల వ్యవస్థలను కూడా వినియోగించుకోకపోవడం వంటి పరిణామాలతో సమస్య మరింత జటిలమైంది. ఈ క్రమంలోనే ఒప్పందంలోని వివాద పరిష్కార యంత్రాంగాన్ని సమీక్షించాలని కూడా భారత్ స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఈ ఒప్పందాన్ని పునఃపరిశీలించాలంటూ జమ్మూకశ్మీరు ప్రజలు కూడా డిమాండ్ చేస్తుండడం విశేషం. పంజాబ్, హరియాణాల్లో కూడా నదీ జలాల అంశం ప్రజల భావోద్వేగాలతో ముడిపడి ఉంది.

# మోదీని అమెరికాలో కలుస్తా



వాషింగ్టన్/న్యూయార్క్: మూడ్రోజుల పర్యటన నిమిత్తం ప్రధాని మోదీ అమెరికాకు వచ్చినపుడు ఆయనను కలుస్తానని అమెరికా ఎన్నికల్లో అధ్యక్ష అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఫ్లోరిడాలోని వెస్ట్ పామ్‌బీచ్ గోల్ఫ్‌క్లబ్‌లో ఆగంతకుడు తనను చంపేందుకు విఫలయత్నంచేశాక ట్రంప్ తొలిసారిగా ఎన్నికల ప్రచారకార్యక్రమంలో పాల్గొన్నారు. బుధవారం మిషిగన్ రాష్ట్రంలోని ఫ్లింట్ నగరంలోని టౌన్‌హాల్‌లో రిపబ్లికన్ పార్టీ కార్యకర్తలనుద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. "అమెరికా దిగుమతుల విషయంలో అధిక సుంకాలు విధిస్తూ భారత్ భిన్నంగా వ్యవహరిస్తోంది. అయినాసరే వారి నేత, ప్రధాని మోదీ అమెరికా పర్యటనకు వచ్చినపుడు ఆయనను కలుస్తా. ఆయన అసాధారణ వ్యక్తి"అని అన్నారు. అయితే ట్రంప్ వ్యాఖ్యలపై భారత విదేశాంగ శాఖ స్పందించలేదు.

### కాబోయే అధ్యక్షులనే కాల్చుతున్నారెందుకో..

తనపై జరిగిన దాడి యత్నాన్ని ట్రంప్ ప్రస్తావించారు. "వేలాది మంది మద్దతుదారుల సమక్షంలో ప్రచారంలో పాల్గొనడం చాలా ఆనందంగా ఉంది. అయితే కార్ రేసింగ్‌లో బుల్ రైడింగ్‌లో పాల్గొనడం ఎంత ప్రమాదకరమో అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనడం కూడా అంతే ప్రమాదకరం. అసలు కాబోయే అధ్యక్షులను మాత్రమే ఎందుకు లక్ష్యంగా చేసుకుని కాల్పులకు తెగబడుతున్నారో అర్థంకావట్లేదు"అని ట్రంప్ అన్నారు. కాల్పుల యత్నం తర్వాత కమల తనకు ఫోన్ చేశారని ట్రంప్ వెల్లడించారు. "ఆమె అలా ఫోన్ చేయడం చాలా బాగుంది. ఇలాంటి పద్ధతిని మనం ఖచ్చితంగా అభినందించాల్సిందే'అని అన్నారు. అమెరికాలో హింసకు తావులేదు అని ట్రంప్‌కు ఫోన్‌చేసిన సందర్భంగా చెప్పానని కమల హారిస్ వెల్లడించడం తెల్సిందే.

### పరస్పర ఆరోపణలు

ట్రంప్‌పై యత్యాయత్నాలకు మీరంటే మరే కారణమని రిపబ్లికన్, డెమొక్రటిక్ పార్టీ నేతలు పరస్పరం ఆరోపణలు చేసుకున్నారు. తాను అధ్యక్షుడినైతే డెమొక్రాట్లపై కేసులు బనాయించి, జైల్లో పడేస్తానని, శరణార్థులను బలవంతంగా దేశం నుంచి బహిష్కరించి పంపించేస్తానని ట్రంప్ చేస్తున్న ప్రకటనలే ఆయన ప్రాణాల మీదకు తెచ్చాయని డెమొక్రాట్లు ఆరోపించారు. డెమొక్రాట్ల ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌పై విద్వేష వ్యాఖ్యలు చేయడం వల్లే ట్రంప్ ప్రాణాలకు ముప్పు ఏర్పడిందని రిపబ్లికన్లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.